సాక్షి ఖమ్మం

ఆదివారం । 3 । సెప్టెంబర్ । 2023



...పెండింగ్ ఉండొద్దు

ఓటర్లుగా నమోదు, సవరణల కోసం అందిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. 8లో



రెండోరోజుకు.. 'అగ్నివీర్'

సైన్యంలో నియామకాలకు సంబంధించి ఖమ్మంలో నిర్వహిస్తున్న అగ్నివీర్ ర్యాలీ రెండో రోజుకు చేరింది. 10లో

గరిష్టం / కనిష్టం
30° / 24°

వాతావరణం

ఆదివారం జిల్లాలో ఉష్ణోగ్రతలు ఎక్కువగానే నమోదవుతాయి. రోజంతా ఉక్కపోత వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

జమలాపురంలో ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. తొలుత అర్చకులు స్వమి స్వామి వారి పాదం, మూల విరాట్ పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఆతర్వాత స్వామి, అమ్మ వార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్యకల్యాణం జరిపించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా హాజరైన భక్తులు కల్యాణాన్ని తిలకించి, పల్లకీ సేవ చేశారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం



కేసుల పరిష్కారాన్ని పర్యవేక్షిస్తున్న న్యాయమూర్తులు

ఖమ్మంలీగల్: ఈనెల 9న జాతీయ లోక్‌అదాలత్ జరగనుండగా, 1వ తేదీ నుంచే ముందస్తుగా కేసుల పరిష్కార ప్రక్రియ ప్రారంభమైంది. ఈమేరకు శనివారం జిల్లా కోర్టులో నిర్వహించిన ముందస్తు లోక్ అదాలత్‌కు పలువురు కక్షిదారులు హాజరయ్యారు. ప్రధానంగా క్రిమినల్ కేసులను ఎక్కువగా పరిష్కరించాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఇన్‌చార్జి జిల్లా న్యాయమూర్తి కె.ఉమాదేవి పర్యవేక్షించారు. కాగా, ఈ లోక్ అదాలత్ బెంచ్‌లు 9వతేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. న్యాయమూర్తులు నాగశ్రావ్య, కె.దీప, వి.మాధవి, ఆర్.శాంతిలత కేసులను పరిష్కరించగా, న్యాయమూర్తులు వి.అపర్ణ, మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా, ఎస్.అమరావతి లోక్ అదాలత్‌లో పాల్గొన్నారు. కాగా, రెండో శ్రేణి మెజిస్ట్రేట్ షేక్ సలీం ఖమ్మం నగరానికి చెందిన పలు కేసులను పరిష్కరించారు.

అడిషనల్ డీసీపీలుగా వెంకట్రావు, ప్రసాద్



వెంకట్రావు



ప్రసాద్‌రావు

ఖమ్మంక్రైం: ఖమ్మం కమిషనరేట్‌కు ఇద్దరు అడిషనల్ డీసీపీలను కేటాయించారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో ఏఎస్పీగా పనిచేస్తున్న జి.వెంకట్రావును అడిషినల్ డీసీపీ(అడ్మిన్)గా, నల్లగొండ ఏఎస్పీ(అడ్మిన్)గా విధులు నిర్వర్తిస్తున్న కేఆర్‌కే.ప్రసాద్‌రావును అడిషినల్ డీసీపీ (లా అండ్ ఆర్డర్)గా కేటాయిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, వెంకట్రావు గతంలో ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఎస్‌ఐ, సీఐ, ఏసీపీగా విధులు నిర్వర్తించారు.

పకడ్బందీగా చట్టాల అమలు

ఖమ్మంమయూరిసెంటర్: అటవీ సంపద, వన్యప్రాణులకు ముప్పు కలిగేలా వ్యవహరించినా, ఉద్యోగులను ఇబ్బంది పెట్టినా సహించేది లేదని... ఇందుకోసం అటవీ సంరక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తామని జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థ విక్రమ్‌సింగ్ స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ సింగరేణి మండలంలో ఓ ప్రజాప్రతినిధి అటవీ శాఖ ఉద్యోగులపై దాడి చేశారని తెలిపారు. దీంతో ఆయనపై అటవీ సంరక్షణ చట్టం మేరకే కాకుండా పోలీసు శాఖ తరఫున కూడా కేసులు నమోదు చేయించినట్లు చెప్పారు. అలాగే, ఆయనను ప్రజాప్రతిధిగా మూడు నెలల పాటు సస్పెండ్ చేశారని తెలిపారు. ప్రజాప్రతినిదులు బాధ్యాతాయుతంగా అటవీ సంపద పరిరక్షణకు పాటుపడుతూ అటవీశాఖ ఉద్యోగులకు అండగా నిలవాలని డీఎఫ్‌ఓ కోరారు.

అర్హులందరికీ టీకాలు

ఖమ్మంరూరల్: అర్హులైన గర్భిణులు, చిన్నారులను గుర్తించి వంద శాతం టీకాలు వేయాలని జిల్లా వాక్సినేషన్ మేనేజర్ సీహెచ్.రమణ సూచించారు. మండలంలోని ఎం.వెంకటాయపాలెం పీహెచ్‌సీని శనివారం తనిఖీ చేసిన ఆయన టీకా నిల్వలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేస్తూ వంద శాతం వ్యాక్సినేషన్ పూర్తిచేయాలని చెప్పారు. అనంతరం రెడ్డిపల్లి, సత్యనారాయణపురంల్లో పర్యటించారు. పీహెచ్‌సీ డాక్టర్ శ్రీదేవి, ఉద్యోగులు అనురాధ, శాంతకుమారి, శారద, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జోష్... కాంగిరేస్!

కాంగ్రెస్ పార్టీలో సందడి నెలకొంది. పార్టీలోకి కొత్త నేతల చేరికలతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. తాజాగా మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఖమ్మంలోని ఆయన నివాసంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఇరువురు నేతలు కొద్దిసేపు రాష్ట్ర రాజకీయాలపై ముచ్చటించారు. అనంతరం ఇద్దరూ మీడియాతో మాట్లాడారు. రాజధానిలో ఇటీవల తుమ్మలను టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కలవగా ఇప్పుడు పొంగులేటి కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. దీంతో తుమ్మల కాంగ్రెస్ పార్టీలో చేరిక ఇక లాంఛనమే కానుంది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం



తుమ్మలను సన్మానిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన సాధు రమేష్‌రెడ్డి, మువ్వా విజయ్‌బాబు, సూతకాని జైపాల్

మాజీ మంత్రి తుమ్మలను కలిసిన పొంగులేటి

- ఇరువురు నేతల కలయికతో కేడర్‌లో ఉత్సాహం
- 'హస్తం'లో తుమ్మల చేరిక లాంఛనమే అంటున్న అనుచరులు

బీఆర్‌ఎస్ టు కాంగ్రెస్

మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాజకీయ ప్రస్తానం సత్తుపల్లి నియోజకవర్గం నుంచే ప్రారంభమైంది. సత్తుపల్లి నుంచి తుమ్మల రాజకీయ అరంగేట్రం చేశారు. పొంగులేటి ఇదే నియోజవకర్గంలోని తన స్వగ్రామమైన కల్లూరు మండలం నారాయణపురం నుంచే రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఇద్దరూ రాజకీయాల పరంగా చూస్తే ఎత్తుపల్లాలు చవిచూశారు. ఎన్టీఆర్, చంద్రబాబునాయుడు సీఎంలుగా ఉన్నప్పుడు తుమ్మల పార్టీ పరంగా ఉమ్మడి జిల్లా రాజకీయాలను శాసించారు. బీఆర్‌ఎస్‌లో చేరాక కూడా ఇదే స్థాయిలో వ్యవహరించారు. గత ఎన్నికల తర్వాత కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లో చేరడంతో ఆయన ఆధిపత్యానికి గండి పడుతూ వచ్చింది. ఒకప్పుడు అనుచరులకు టికెట్లు ఇప్పించిన ఆయనకు ఈసారి బీఆర్‌ఎస్ మొండి చేయి చూపించింది. దీంతో వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా పోటీ చేయడం ఖాయమని ప్రకటించారు. కాంగ్రెస్ నేతలు ఆయన్ను కలవడంతో తుమ్మల పయనం హస్తం గూటికేనని తేలింది. ఇక వైఎస్సార్‌సీపీ నుంచి పొంగులేటి రాజకీయ ప్రస్థానం మొదలు కాగా.. బీఆర్‌ఎస్‌లో చేరాక అనుచరులను అంటిపెట్టుకుని ఉన్న ఆయనకు గత ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇవ్వలేదు. అనంతర పరిణామాలతో పొంగులేటి కాంగ్రెస్‌లో చేరి ఇప్పటికే కీలక పదవిలో ఉండగా... తుమ్మల కూడా చేరితే తగిన గౌరవం దక్కుతుందనే అభిప్రాయం ముఖ్య అనుచరుల్లో వ్యక్తమవుతోంది.

హైదరాబాద్ లేదా ఢిల్లీ

పాలేరు నియోజకవర్గంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా అనుచరులతో తుమ్మల చర్చలు జరుపుతున్నారు. అనుచరగణం, కేడర్ అభిప్రాయం మేరకు పార్టీ మారేందుకు సిద్ధమైన ఆయనను శనివారం కూడా పాలేరు నియోజకవర్గంలోని ముఖ్య నేతలు కలిశారు. కాంగ్రెస్ అధిష్టానం ఇచ్చే సమాచారంతో హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభలో తుమ్మల చేరిక ఉండొచ్చన్నది సమాచారం. ఇక ఉమ్మడి ఖమ్మంతో పాటు రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో ఉన్న తన సామాజికవర్గ నేతలు కొందరితోనూ ఆయన పార్టీ మార్పుపై చర్చిస్తున్నట్లు తెలిసింది. ఈ సభలో కుదరదని భావిస్తే అంతకన్నా ముందే ఢిల్లీ వెళ్లి పార్టీ అగ్రనేతల సమక్షానలో కాంగ్రెస్‌లో చేరతారనే ప్రచారం జరుగుతోంది.

చేరికలతో మళ్లీ రేసులోకి...

సిట్టింగ్ ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లో చేరాక పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బ తగిలింది. కానీ తాజా పరిణామాలు ఆ పార్టీని వచ్చే ఎన్నికల రేసులో నిలబెట్టాయనే విశ్లేషణ మొదలైంది. మాజీ ఎంపీ పొంగులేటితోపాటు పలు నియోజకవర్గాల్లోని ఆయన అనుచరులు కూడా కాంగ్రెస్‌లో చేరారు. ఇక తుమ్మల సైతం హస్తం గూటికి చేరనుండడంతో ఉమ్మడి జిల్లాలోని ఆయన అనుచరులు అదే దారిలో నడుస్తారు. తద్వారా మొన్నటి వరకు నైరాశ్యంలో ఉన్న కాంగ్రెస్‌లోని కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులకు బలాన్ని ఇచ్చినట్లవుతుందనే చర్చ జరుగుతోంది.

పాలేరు, ఖమ్మంపై ఫోకస్

మారుతున్న రాజకీయ సమీకరణాలతో కాంగ్రెస్‌లో టికెట్లు ఆశిస్తున్న వారి సంఖ్య పెరిగింది. అయితే తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరితే పాలేరు నుంచే బరిలోకి దిగుతారన్న ప్రచారం ఊపందుకుంది. అలాగే, శ్రీనివాసరెడ్డి కూడా ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారన్న ప్రచారంతో ఎవరికి టికెట్ ఖాయమవుతుందనే అంశం జిల్లా రాజకీయాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని జనరల్ స్థానాలైన ఖమ్మం, పాలేరు, కొత్తగూడెంలో అధికార పార్టీకి దీటుగా బలమైన అభ్యర్థులను బరిలో దింపాలన్న యోచనలో కాంగ్రెస్ ఉంది. ఈనేపథ్యాన శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావుల్లో పాలేరులో ఒకరిని, ఖమ్మంలో మరొకరిని పోటీకి దింపాలని భావనతో ఎవరికి ఏ స్థానం కేటాయిస్తే సమీకరణలు ఎలా ఉంటాయనే అంశంపై అధిష్టానం ఆరా తీస్తున్నట్లు తెలిసింది. మరోపక్క పాలేరు నుంచి ఆ పార్టీ నేతలు రాయల నాగేశ్వరరావు, మద్ది శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్ల శ్రీరాంయాదవ్ తదితరులు టికెట్ కోసం దరఖాస్తు చేసుకోవడం, కొత్తగూడెం టికెట్ కోసం కూడా దరఖాస్తులు అందిన నేపథ్యాన వీరి బలాబలాలను గుర్తించేందుకు పార్టీ ఇప్పటికే చేయించిన సర్వే నివేదికలతో అంచనా వేస్తోంది.

తైతక్కలాడితే ప్రజలు నమ్మరు..



మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పక్కన డీసీసీబీ చైర్మన్ నాగభూషణం తదితరులు

- 24 గంటల కరెంట్ వద్దన్న కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పండి
- రఘునాథపాలెం మండలాన్ని రూ.250 కోట్లతో అభివృద్ధి చేశాం
- ఈర్లపూడి సభలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

రఘునాథపాలెం: డ్యాన్స్ చేస్తూ, తైతక్కలాడే వారిని ప్రజలు నమ్మరని... అభివృద్ధి చేసే వారికి మాత్రమే ప్రజల మనస్సులో స్థానం ఉంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. అర్బన్ మండలంలో ఉన్నప్పుడు ఈ గ్రామాలకు ఏదైనా చేసిన వారున్నారా అని ప్రశ్నించారు. కానీ బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక రఘునాథపాలెంను ప్రత్యేక మండలంగా ఏర్పాటుచేయడమే కాక వందల కోట్ల నిధులతో అభివృద్ధి శరవేగంగా చేస్తున్నామని వెల్లడించారు. రఘునాథపాలెం మండలంలోని ఈర్లపుడిలో రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, హైమాస్ట్ లైట్లను శనివారం ప్రారంభించిన మంత్రి... రూ.1.78 కోట్లతో ఈర్లపుడి-లచ్చిరాంతండా బీసీ రోడ్డు మరమ్మతులు, రూ.1.72 కోట్లతో ఈర్లపుడి-దొనబండ రహదారి మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి పువ్వాడ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ఖమ్మం నగరంతో సమానంగా రఘునాథపాలెం మండలం సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పించడంతో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించినట్లు చెప్పారు. ఇక సుపరిపాలన అందించేందుకు మండల పరిషత్ కార్యాలయం, తహసీల్, పోలీస్ స్టేషన్‌ను ఒకే సముదాయంలో నిర్మించినట్లు వివరించారు. కాగా, ఎన్నికల సమయాన కొందరు వచ్చి ప్రలోభపెట్టేందుకు యత్నించే వారిని నమ్మొద్దని సూచించారు. రాష్ట్రంలో రైతులకు 24 గంటల విద్యుత్ అవసరం లేదన్న రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పి.. మరోమారు కేసీఆర్ సీఎం అయ్యేలా బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్, ఎంపీపీలు గౌరి, గుత్తా రవి, మార్కెట్ చైర్మన్ దోరేపల్లి శ్వేతతో పాటు అఫ్జల్, జానకీరాం, చిట్టెం నర్సింహారావు, అజ్మీరా వీరూనాయక్, మద్దినేని వెంకటరమణ, కుర్రా భాస్కర్‌రావు, పిన్ని కోటేశ్వరరావు, కొంటెముక్కల వెంకటేశ్వర్లు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.



సోలార్ పార్కింగ్ షెడ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ, కలెక్టర్ గౌతమ్, ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే వెంకటవీరయ్య తదితరులు

దేశంలోనే ప్రప్రథమంగా సోలార్ పార్కింగ్ షెడ్

ఖమ్మం సహకారనగర్: దేశంలోనే ప్రప్రథమంగా ఖమ్మం కలెక్టరేట్‌లో రూ.1.58 కోట్లతో 200 కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ పార్కింగ్ షెడ్ ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో ఉద్యోగుల వాహనాల పార్కింగ్ కోసం సోలార్ ప్యానళ్లతో షెడ్ నిర్మించగా 200 కిలోవాట్ విద్యుత్‌ను పవర్ గ్రిడ్‌కు శనివారం అనుసంధానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి అజయ్‌కుమార్ మాట్లాడుతూ కొత్త కలెక్టరేట్లలో ఖమ్మంలోనే మొదటగా సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పుడు మిగతా చోట్ల కూడా అనుసరిస్తున్నారని తెలిపారు. ఈ ప్లాంట్‌తో రోజుకు 800 నుండి 1000 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కానుండగా.. నెలకు రూ.80 వేల నుండి రూ.లక్ష వరకు చార్జీలు ఆదా అవుతాయని చెప్పారు. కాగా, ప్రభుత్వం, ఉద్యోగులది ఎవరూ విడదీయలేని బంధమని.. వారికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని పేర్కొన్నారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తూ పాలనను ప్రజల ముంగిట్లోకి తెచ్చిందన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర కీలకమని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సోలార్ ప్లాంట్‌కు వెచ్చించిన నిధులు ఐదేళ్లలోగా బిల్లు ఆదా రూపంలో సమకూరుతాయన్నారు. అనంతరం సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడగా సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ఆదిత్య ఎల్–1' విజయవంతంపై మంత్రి హర్షం

ఖమ్మంమయూరిసెంటర్: ఇస్రో ప్రయోగించిన 'ఆదిత్య ఎల్1' ఉపగ్రహ ప్రయోగం విజయవంతం కావడంపై మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. అంతరిక్ష పరిశోధనా రంగంలో దేశ శాస్త్రవేత్తలు సత్తా చాటుతూ ప్రతీ భారతీయుడు గర్వపడేలా చేశారని తెలిపారు.

వైభవంగా సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు అనంతరం నిత్యకల్యాణం నిర్వహించారు.

చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభం



మాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ, సినీతార కృతిశెట్టి, మేనేజింగ్ డైరెక్టర్ మర్రి జనార్దన్‌రెడ్డి తదితరులు

పాల్గొన్న సినీనటి కృతిశెట్టి, మంత్రి పువ్వాడ

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని కొత్త బస్టాండ్ సమీపాన బైపాస్ రోడ్డులో ఏర్పాటుచేసిన చెన్నై షాపింగ్ మాల్‌ను శనివారం ప్రారంభించారు. సినీనటి కృతిశెట్టి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఈ షోరూంను ప్రారంభించగా, షాపింగ్ మాల్ మేనేజింగ్ డైరెక్టర్లు మర్రి జనార్దన్‌రెడ్డి, వెంకటరెడ్డి, శశిధర్‌రెడ్డి, జమునారెడ్డి, మధుమతి పాల్గొన్నారు. ఈమేరకు వారు షోరూంలోని వివిధ విభాగాలను ప్రారంభించాక సినీతార కృతిశెట్టి మాట్లాడుతూ ఖమ్మంలో రెండో బ్రాంచ్, రాష్ట్రంలో 17వ షోరూం ప్రారంభోత్సవానికి రావడం సంతోషంగా ఉందని తెలిపారు. కాగా, కృతిశెట్టిని చూసేందుకు పెద్దసంఖ్యలో అభిమానులు తరలిరాగా, కేరళ కళాకారుల నృత్యాలు, సినీ కళాకారులు శివారెడ్డి, అవినాష్ అభి, రాజమౌళి స్కిట్లు అలరించాయి.

అరటి గెలలకు గిరాకీ !



అరటి వేలంలో పాల్గొన్న వ్యాపారులు

సత్తుపల్లి శివారు పెద్ద వంతెనవద్ద శనివారం నిర్వహించిన వేలంలో అరటి గెలలకు మంచి ధర పలికింది. ఏపీలోని రావులపాలెంకు చెందిన రైతులు వెయ్యికి పైగా అరటి గెలలు తీసుకొచ్చారు. శ్రావణమాసం నేపథ్యాన పండ్లకు గిరాకీ ఉండడంతో ఖమ్మం, సత్తుపల్లి, కొత్తగూడెం, వైరా, జూలూరుపాడు, కల్లూరు ప్రాంతాల వ్యాపారులు పాల్గొన్నారు. చిన్న గెలలు రూ.100 నుంచి రూ.150 వరకు, పెద్ద గెలలు రూ.600 నుంచి రూ.800 వరకు ధర పలికాయి. సుమారు వెయ్యి గెలలను వేలంలో వ్యాపారులు కొనుగోలు చేశారని సత్తుపల్లికి చెందిన చీపు రామారావు తెలిపారు. – సత్తుపల్లిటౌన్

గురువులకు వందనం

ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులంటే కొందరికి మంచి భావన ఉండదు. విధి నిర్వహణలో సక్రమంగా వ్యవహరించరని అనుకుంటారు. కానీ చాలామంది తాము పనిచేస్తున్న పాఠశాలను అభివృద్ధి చేయడమే కాక విద్యార్థులను అన్నిరంగాల్లో తీర్చిదిద్దాలని తపన పడుతుంటారు. ఇలాంటి వారిని ప్రోత్సహించేందుకు ఏటా దివంగత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి అయిన సెప్టెంబర్ 5న నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రభుత్వం ఎంపిక చేస్తుంది. ఈసారి కూడా శనివారం జాబితా విడుదల చేయగా.. ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులకు స్థానం దక్కింది. కొత్తగూడెం కూలీలైన్ ప్రభుత్వోన్నత పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, భద్రాచలం సుభాష్‌నగర్ కాలనీలోని ఎస్‌జీకే ఎయిడెడ్ ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయురాలు ఉషారాణితో పాటు బోనకల్ మండలం రాపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఆవుల రాంబాబు ఎంపికయ్యారు. ఈమేరకు వారు విద్యార్థులు, పాఠశాల అభ్యున్నతికి పాటుపడిన తీరుపై కథనం..

- రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక
- ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురికి స్థానం
- పాఠశాలలు, విద్యాభివృద్ధికి చేసిన కృషితో దక్కిన ఫలితం

అటు హాజరు.. ఇటు అభివృద్ధి

- భద్రాచలం ఎస్‌జీకే ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయురాలు ఉషారాణి



ఉషారాణి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీ ఎస్‌జీకే ఎయిడెడ్ ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయురాలు వెంపటి ఉషారాణి విద్యార్థులు ఎక్కువ మంది చేరేలా కృషి చేస్తూనే వారు నిరంతరం పాఠశాలకు వచ్చేలా పర్యవేక్షిస్తున్నారు. ఉషారాణి పాఠశాల పరిధిలోని ఇంటింటికీ వెళ్లి నూరు శాతం నమోదు ప్రక్రియ పూర్తి చేశారు. అలాగే, ఎవరైనా పాఠశాలకు రాకపోతే ఇంటికి వెళ్లి కారణాలు ఆరా తీసి వంద హాజరు శాతం నమోదయ్యేలా పర్యవేక్షిస్తారు. ఇక పాఠశాల చుట్టూ అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్నారు. దాతల చేయూతతో సుమారు రూ.10 లక్షలు వెచ్చించి పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించి గేట్ ఏర్పాటు చేయించారు. ఇక విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలలో హ్యాండ్ వాష్ సెంటర్ నిర్మించారు.

శిక్షణ పొందుతూ.. తర్ఫీదునిస్తూ

- కొత్తగూడెం కూలీలైన్ పాఠశాల హెచ్‌ఎం రమాదేవి



గుంటి రమాదేవి

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉంటూ.. సర్వతోముఖాభివృద్ధికి అనునిత్యం తపించే ఉపాధ్యాయుల జాబితాలో కొత్తగూడెంలోని కూలీలైన్ ప్రభుత్వోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గుంటి రమాదేవి ముందు వరుసలో నిలుస్తారు. 22 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఆమె బాబుక్యాంపు, బూడిదగడ్డ, కూలీలైన్ పాఠశాలల్లో ఆంగ్లం బోధిస్తున్నారు. విద్యార్థులను చదువుకే పరిమితం చేయకుండా యోగా, ధ్యానం, వక్తృత్వం, నృత్యరూపకాలు, సైన్స్ ఫేర్‌లు, స్కౌట్స్ అండ్ గైడ్స్‌ల్లో సత్తా చాటేలా తీర్చిదిద్దుతున్నారు. ఇందుకోసం ఆమె శిక్షణ తీసుకుంటూ విద్యార్థులకు తర్ఫీదునిస్తుండడం విశేషం. హెచ్‌ఎంగా నాలుగేళ్ల నుంచి కూలీలైన్ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న రమాదేవి.. పాఠశాల అభివృద్ధి కోసం దాతల చేయూత కోరుతూనే సొంత డబ్బు కూడా వెచ్చిస్తున్నారు. మరోపక్క స్థానిక మహిళల కోసం ఉచిత యోగా శిక్షణ ఇస్తున్నారు. బాలికా విద్యపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచే రమాదేవికి సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ ఫెడరేషన్ వారు నారీ సమ్మాన్ అవార్డుతో సన్మానించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాలో తనకు చోటు దక్కడం ఆనందంగా ఉందని తెలిపారు.

వసతుల కల్పనలో భేష్

- రాపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు రాంబాబు



రాంబాబు

బోనకల్: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిద్దడంతోనే తన బాధ్యత తీరినట్లు భావించకుండా, పేద విద్యార్థులకు అండగా నిలవడం, పాఠశాలలో వసతులు కల్పించడమే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తున్నారు బోనకల్ మండలం రాపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు ఆవుల రాంబాబు. ఆయన రెండేళ్ల నుంచి డిప్యూటేషన్‌పై మోటమర్రి ఉన్నత పాఠశాలలో బోధిస్తున్నారు. ఉత్తమ బోధనతో విద్యార్థుల్లో ఎక్కువ మంది 10జీపీఏ సాధిస్తుండడం విశేషం. దాతల సహకారంతో పేద విద్యార్థులకు చేయూతనందిస్తున్నారు. పాఠశాలలో వసతుల కల్పనకు కూడా కృషి చేస్తున్న ఆయన అభినందనలు అందుకుంటున్నారు. 2018 వరకు మధిర మండలం కంభంపాడు పాఠశాలలో పనిచేసినపుడు విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచేందుకు రాంబాబు కృషి చేశారు. గతంలోనూ మండల, జిల్లా స్థాయి అవార్డులు సాధించగా, ఇప్పుడు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంపై యూటీఎఫ్ బాధ్యులు రాంబాబు, భూపతి, రామకృష్ణ, చంద్రప్రసాద్, పుల్లారావు, నర్సింహారావు, రమేష్, సౌభాగ్యలక్ష్మి, లక్ష్మి, గోపాలరావు, చిన్నరంగారావు తదితరులు అభినందించారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మయాంక్‌సింగ్

చింతకాని: మండలంలోని నాగులవంచలో అభివృద్ధి పనులను అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్‌సింగ్ శనివారం పరిశీలించారు. అలాగే, గ్రామంలోని పీహెచ్‌సీకి వెళ్లి వైద్యసేవలపై ఆరా తీశారు. ఆ తర్వాత ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి అర్హులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కాగా, ఐఏఎస్ శిక్షణలో భాగంగా నాగులవంచలో ఆరు రోజులు విధులు నిర్వర్తించిన మయాంక్ సింగ్‌ను సర్పంచ్ ఆలస్యం నాగమని తదితరులు సన్మానించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్‌తో పాటు మునుకుంట్ల నాగరత్నం, రాధిక తదితరులు పాల్గొన్నారు.

మహానేతల ఆశయ సాధనకు కృషి చేయాలి



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మంద కృష్ణమాదిగ

ముదిగొండ: మహానేతలను ఎన్నడూ మరవొద్దని, వారి ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. ముదిగొండ మండలం పెద్దమండవ ఎస్సీకాలనీలో ఏర్పాటుచేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలను శనివారం రాత్రి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వేల ఏళ్లుగా అణచివేయబడ్డ అన్ని వర్గాలను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వెలుగులోకి తీసుకొచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శెట్టిపోగు రామారావు, ఎంపీటీసీ కుక్కల వెంగళరావుతో పాటు నూకల నాగేశ్వరరావు, పులిపాటి ప్రకాష్, తిరుపతిరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

వైరారూరల్: మూడు రోజుల కిందట గడ్డి మందు పిచికారీ చేస్తుండగా ప్రమాదవశాత్తు కలుపు మందు నోట్లోకి లోకి వెళ్లడంతో అస్వస్థతకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని కేజీ సిరిపురం గ్రామపంచాయతీలో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్న పగిడిపల్లి వెంకటేశ్వర్లు (45) గత నెల 31వ తేదీన ఇంటి ఆవరణలో గడ్డి మందు పిచికారీ చేస్తుండగా పవర్ స్ప్రేయర్ ఆగిపోయింది. దీంతో పైప్ నోట్లో పెట్టుకుని ఊదగా మందు గొంతులోకి వెళ్లడంతో అస్వస్థతకు గురయ్యాడు. దీంతో ఆయనను ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. వెంకటేశ్వర్లుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉండగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

కామేపల్లి(కారేపల్లి): బట్టలు ఆరవేసే క్రమంలో షాక్‌కు గురైన మహిళ మృతి చెందింది. కామేపల్లి మండలం మద్దులపల్లికి చెందిన దమ్మాలపాటి రమాదేవి(36) శుక్రవారం రాత్రి బట్టలను ఇంటి ఆరుబయట ఇనుప దండెంపై ఆరవేస్తోంది. ఈ క్రమంలో దండెంకు విద్యుత్ సరఫరా కావటంతో రమాదేవి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు కుమార్తెలున్నారు.

పగలు చెత్త సేకరణ.. రాత్రి చోరీలు

పాల్వంచరూరల్: పగలు చెత్త సేకరిస్తూ, రాత్రి వేళ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో సీఐ వినయ్‌కుమార్ శనివారం వివరాలు వెల్లడించారు. సీఐ కథనం ప్రకారం.. మండల పరిధిలోని రాజాపురం వద్ద శనివారం ఎస్‌ఐ కార్తీక్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. పట్టుకుని విచారణ జరపగా కుక్కునూరుకు చెందిన అల్లం రమేష్, వీఎంబంజరకు చెందిన మాలె లక్ష్మణ్ రావు, అశ్వారావుపేట మండలం దిబ్బగూడేనికి చెందిన పూజారి లక్ష్మణ్‌గా తేలింది. వీరు రెండేళ్లుగా పాల్వంచ పట్టణ, మండల పరిధిలో పగటి పూట చెత్తను సేకరిస్తూ రాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతున్నారు. ఇప్పటివరకు 11 చోరీలు చేసినట్లు విచారణలో ఒప్పుకున్నారు. వారి నుంచి విద్యుత్ మోటార్లు, రాగివైరు, అల్యూమినియం, రేంచీలు, సుత్తి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ.కార్తీక్, పోలీసు సిబ్బంది రాములునాయక్, చిరంజీవి పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,026

ఏ దరఖాస్తూ పెండింగ్ ఉండొద్దు

ఓటరు జాబితా సవరణపై కలెక్టర్ గౌతమ్



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంసహకారనగర్: రెండో ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా అందిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ వీసీ ద్వారా పలు అంశాలపై సమీక్షించారు. ఈ వీసీకి జిల్లా నుంచి కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణ సాఫీగా సాగేలా గట్టి నిఘా ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి పోలీసులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. అలాగే, నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓలు జి.గణేష్, అశోక్ చక్రవర్తి, ఎస్డీసీ రాజేశ్వరి, స్వీప్ నోడల్ అధికారి శ్రీరాం, జెడ్పీ సీఈఓ అప్పారావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులన్నీ పరిష్కరించండి

కొణిజర్ల: ఓటర్ల నమోదు, సవరణకు సంబంధించిన దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. మండలంలోని తనికెళ్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించి వివరాలు ఆరా తీశారు. అనంతరం ఉద్యోగులకు సూచనలు చేశారు. ఆ తర్వాత పాఠశాలలో బోధనను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా 8, 9, 10 తరగతుల విద్యార్థులకు డిజిటల్ పాఠాలు బోధిస్తున్నారా అని ఆరా తీశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ యర్రయ్య తదితరులు పాల్గొన్నారు.



తనికెళ్లలో డిజిటల్ బోధనను పరిశీలిస్తున్న కలెక్టర్

మార్గదర్శకాలకు అనుగుణంగా క్రమబద్ధీకరణ

ఖమ్మంసహకారనగర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చేప్టాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఆయన ఎంపీడీఓలు, ఎంపీఓలతో సమావేశమై మాట్లాడుతూ జేపీఎస్‌ల క్రమబద్ధీకరణకు అవలంబించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, జెడ్పీ సీఈఓ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మరపురాని మహామనిషి వైఎస్సార్

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం సహకారనగర్/ఖమ్మంఅర్బన్: సామాన్య, మధ్యతరగతి కుటుంబాల్లో సంతోషం నింపడమే కాక అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు అహర్నిశలు కష్టపడిన మహోన్నత నేత దివంగత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అని కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే, ఖానాపురం సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద కూడా నివాళులర్పించాక పొంగులేటి మాట్లాడారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో లక్షలాది మందికి లబ్ధి జరిగిందని గుర్తుచేశారు. ఇక కాంగ్రెస్ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించాక మాట్లాడారు. ఉమ్మడి ఏపీలో వైఎస్సార్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమాల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, కార్పొరేటర్లు దొడ్డా నగేశ్ యాదవ్, మలీదు జగన్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, ఎంపీపీ గోసు మధు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్‌తో పాటు నాయకులు మద్దినేని బేబీస్వర్ణకుమారి, డాక్టర్ కోటా రాంబాబు, పుచ్చకాయల వీరభద్రం, మద్ది శ్రీనివాసరెడ్డి, దొబ్బల సౌజన్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, మొక్కా శేఖర్‌గౌడ్, పసుపులేటి దేవేంద్రం, వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, పాలకుర్తి నాగేశ్వరరావు, చోటా బాబా, షేక్ ఇమాం, బోడా శ్రావణ్, కీసర పద్మజారెడ్డి, కొంగర జ్యోతిర్మయి, బాణాల లక్ష్మణ్, ఉపేందర్, రాధాకృష్ణ, చల్లా రామకృష్ణారెడ్డి, వెనిగళ్ల నాగేశ్వరరావు, కలకోట శ్రీకాంత్, గోపి పాల్గొన్నారు.



ఖానాపురంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించి మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి



వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నాయకులు

ప్రజలకు పాలేరుగా పని చేస్తా..

జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

ఎర్రుపాలెం: మధిర నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ పాలేరుగా పనిచేస్తానని, మరింత అభివృద్ధి చేసేందుకు ఒకసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ కోరారు. మండలంలోని ఇనగాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో గ్రామానికి చెందిన 20 కుటుంబాలు కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరాయి. ఈ సందర్భంగా కమల్‌రాజ్ వారిని ఆహ్వానించాక మాట్లాడుతూ మధిర ఎమ్మెల్యేగా మల్లు భట్టి విక్రమార్కను గెలిపిస్తే అభివృద్ధి జరగకపోగా, ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని చెప్పారు. జెడ్పీ చైర్మన్‌గా తాను మధిరలో రూ.35 కోట్లతో 100 పడకల ఆస్పత్రి, బనిగండ్లపాడు పీహెచ్‌సీకి రూ.1.60 కోట్లతో నూతన భవన నిర్మాణాలకు కృషి చేశానని తెలిపారు. కాగా, ఎలాగైలా గెలవాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ విడుదల చేస్తున్న మోసపూరిత డిక్లరేషన్లను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పంబి సాంబశివరావు, యన్నం శ్రీనివాసరెడ్డితో పాటు చావా రామకృష్ణ, వేమిరెడ్డి బాలరాఘవరెడ్డి, సగ్గుర్తి కిశోర్, పాట్టపింజర నర్సింహ, శెట్టిపల్లి మదన్‌రెడ్డి, కుడుముల మధుసూదన్‌రెడ్డి, చెన్నంరాజు పురుషోత్తంరాజు, గుర్రాల పుల్లారెడ్డి, పాట్టపింజర చిట్టిబాబు, ఇనపనూరి భాస్కర్, దేవరకొండ చిరంజీవి, పులి శిరీష, దేవరకొండ రవి, శ్రీపాలశెట్టి తిరుపతిరావు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న శిరీష

నేలకొండపల్లి: మొక్కలు నాటడమే కాక సంరక్షణను అందరూ బాధ్యతగా భావించాలని అడిషనల్ డీఆర్డీఓ శిరీష సూచించారు. మండలంలోని గువ్వలగూడెం, ముజ్జుగూడెం, అనాసాగారాం, సదాశివాపురం, కొత్తకొత్తూరు, నేలకొండపల్లిలో శనివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలతో పాటు ఉపాధి హామీ పనులను పరిశీలించాక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమయ్యారు. అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఏ మొక్క కూడా చనిపోకుండా సంరక్షించాలని సూచించారు. ఎంపీడీఓ కె.జమలారెడ్డి, ఎంపీఓ శివతో పాటు ఆర్.సునీత, శేషగిరిరావు, శైలజ పాల్గొన్నారు.

జ్వరంతో ఎలక్ట్రీషియన్ మృతి

కామేపల్లి(కారేపల్లి): జ్వరంతో బాధపడుతున్న ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. కామేపల్లికి చెందిన ఎలక్ట్రీషియన్ మోసం రాఘవ (28)కు ఐదు రోజులుగా జ్వరం వస్తుండగా ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆయన శనివారం మృతి చెందినట్లు కుటుంబీకులు వెల్లడించారు.

గ్యాస్ లేక అంగన్‌వాడీలో వెలగని పొయ్యి



నిర్వాహకురాలిని ప్రశ్నిస్తున్న కార్పొరేటర్

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 7వ డివిజన్ టేకులపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్ర, శనివారం లబ్ధిదారులకు భోజనం అందలేదు. ఈ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు గుడ్లు, పాలు, భోజనం అందించాల్సి ఉన్నా గ్యాస్ అయిపోవడంతో పస్తులు ఉంచారు. ఈ మేరకు విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ శనివారం కేంద్రానికి వెళ్లి నిర్వాహకులను మందలించారు. గ్యాస్ అయిపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉన్నా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ఈ విషయమై అంగన్‌వాడీ టీచర్ మల్లికాంబను వివరణ కోరగా గ్యాస్ అయిపోవడంతో వంట చేయలేదని తెలిపారు. తనకు బీఎల్‌ఓ డ్యూటీ ఉండడంతో ఇతర ఏర్పాట్లు చేయలేకపోయానని చెప్పారు. పక్కనే ఉన్న పాఠశాల నుంచి కొందరికి గుడ్లు, పాలు సమకూర్చినా భోజనం పెట్టడం సాధ్యం కాలేదని తెలిపారు.

మావోయిస్టు కొరియర్ అరెస్టు

భద్రాచలంఅర్బన్: మావోయిస్టు పార్టీ కొరియర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ వివరాలు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట ప్రాంతానికి చెందిన అగారపు స్వామి అలియాస్ భీమన్న మావోయిస్టు నాయకులు దామోదర్, ఆజాద్‌లకు కొరియర్‌గా పనిచేస్తున్నాడు. వరంగల్‌లోని ఓ కంకర మిల్లు యజమాని నుంచి రూ.60 వేలు వసూలు చేసి, కొత్త సెల్‌ఫోన్, పేలుడు పదార్థాలను మావోయిస్టులకు చేరవేసేందుకు తీసుకెళ్తుండగా చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో తనిఖీలు చేపట్టిన స్థానిక పోలీసులు, సీఆర్పీఎఫ్ 141 బెటాలియన్ జవాన్లు పట్టుకున్నారు. అతని నుంచి రూ.60 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు, 25 మీటర్ల కార్డెక్స్ వైర్, 3 డిటోనేటర్లు, 10 జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం చేసుకున్నారు. స్వామి అలియాస్ భీమన్న 2000-05 మధ్యకాలంలో మావోయిస్టు పార్టీ నర్సంపేట ఏరియా ఎల్‌జీఎస్ దళ సభ్యునిగా పనిచేసి, 2005లో అప్పటి వరంగల్ ఎస్పీ ఎదుట లొంగిపోయాడు. మళ్లీ మూడేళ్లుగా మావోయిస్టు కొరియర్‌గా వ్యవహరిస్తున్నాడు. శనివారం అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. చర్ల సీఐ రాజగోపాల్, ఎస్‌ఐ నర్సిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్ల బదిలీలకు వేళాయె..

- నేటి నుంచి దరఖాస్తుకు అవకాశం
- పదోన్నతులకు కూడా ఆన్‌లైన్‌లోనే

ఖమ్మంసహకారనగర్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెల 3వ తేదీ ఆదివారం నుంచి 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఆ తర్వాత 6, 7వ తేదీల్లో ఉపాధ్యాయులు ఆన్‌లైన్ కాపీలను డీఈఓ కార్యాలయంలో నేరుగా అందించాల్సి ఉంటుంది. ఇక 8, 9వ తేదీల్లో జాబితా ప్రదర్శన, 10, 11వ తేదీల్లో అభ్యంతరాలు స్వీకరించి ఈ నెల 12, 13వ తేదీల్లో సీనియారిటీ జాబితాలు ప్రదర్శిస్తారు.

ప్రక్రియ ఇలా..

ఈ నెల 14వ తేదీన ఎడిట్ ఆప్షన్లు, 15వ తేదీన ఆన్‌లైన్ ద్వారా హెచ్‌ఎంల బదిలీ ప్రక్రియ చేపడుతారు. అనంతరం 16వ తేదీన హెచ్‌ఎంల ఖాళీ పోస్టులు వెల్లడించి, ఆ స్థానంలో 17 నుంచి 19వ తేదీ వరకు స్కూల్ అసిస్టెంట్ల(ఎస్‌ఏ)కు హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పిస్తారు. ఇక 20, 21వ తేదీల్లో ఎస్‌ఏ ఖాళీల వివరాలు వెల్లడించి, 21న వెబ్ ఆప్షన్లు, 22న ఎడిట్ ఆప్షన్లకు అవకాశం కల్పించనున్నారు. ఆ తర్వాత 23, 24వ ఎస్‌ఏల బదిలీలు పూర్తిచేసి, ఖాళీలు వెల్లడించాక 26 నుంచి 28 వరకు ఎస్‌జీటీలకు ఎస్‌ఏలుగా పదోన్నతులు కల్పించే ప్రక్రియ చేపడుతారు. అనంతరం 29 నుంచి 31 వరకు ఖాళీలు వెల్లడించడంతో పాటు అక్టోబర్ 2 నుంచి మార్పులకు అవకాశం కల్పించి, 3 నుంచి ఎస్‌జీటీ, భాషా పండితులు, పీఈటీల బదిలీలు చేయడంతో పాటు ఆపై అప్పీల్‌కు అవకాశం కల్పించనున్నారు.

మళ్లీ మొదలైన వివరాల సేకరణ

జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇందుకోసం ఇప్పటికే మండల స్థాయి నుంచి వివరాలు సేకరిస్తున్నారు. గతంలో ఖాళీల వివరాలు సేకరించగా.. మళ్లీ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మార్పులు, చేర్పులు చేయనున్నారు. ఈమేరకు డీఈఓ కార్యాలయం నుంచి అందిన సూచనలతో ఎంఈఓలు జాబితాలు సిద్ధం చేస్తున్నారు.

పాత డీఈఓ కార్యాలయమే..

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియ పాత డీఈఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆ దిశగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. రోజుకు వందల సంఖ్యలో ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలించాల్సి ఉంటుంది. అయితే, డీఈఓ కార్యాలయం కొత్త కలెక్టరేట్‌లో కొనసాగుతున్నందున అక్కడ ఇబ్బంది ఎదురవుతుందని.. పాత డీఈఓ కార్యాలయంలోనే నిర్వహించాలనే భావనకు వచ్చినట్లు తెలిసింది.

ఖమ్మంలో ఆర్టీసీ కన్వెన్షన్ సెంటర్

నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి పువ్వాడ



సెంటర్ నిర్మించనున్న స్థలంలో చేస్తున్న ఏర్పాట్లు

ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మంలో ఆర్టీసీ ఆధ్వర్యాన అధునాతన సౌకర్యాలతో కన్వెన్షన్ సెంటర్ నిర్మించనున్నారు. రూ.40 కోట్ల అంచనా వ్యయంతో కొత్త బస్టాండ్ పక్కనే నిర్మించే ఈ సెంటర్‌కు ఆదివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శంకుస్థాపన చేయనున్నారు. అన్ని హంగులతో ఈ సెంటర్‌ను నిర్మించనుండగా, జిల్లా వాసులకు అత్యాధునిక ఫంక్షన్ హాల్ అందుబాటులోకి వస్తుంది. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు రెండు అంతస్తుల మేర నిర్మించే ఈ సెంటర్ జిల్లా కేంద్రానికి శోభ చేకూర్చనుందని భావిస్తున్నారు. అలాగే, షాపింగ్ బ్లాక్ కూడా అందుబాటులోకి వస్తుందని అధికారులు వెల్లడించారు. కాగా, ఈ సెంటర్ నిర్మాణ పనులకు మంత్రి పువ్వాడ ఆదివారం శంకుస్థాపన చేయనుండగా, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీలు నామా నాగేశ్వరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, నర్సిరెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, కరీంనగర్ జోన్ ఈడీలు వినోద్‌కుమార్, ఎస్.కృష్ణకాంత్, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, మేయర్ నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి తదితరులు పాల్గొంటారని అధికారులు వెల్లడించారు.

సత్తుపల్లిలో పిచ్చికుక్కల స్వైరవిహారం

గంట వ్యవధిలో 16 మందిపై దాడి



గాయం చూపిస్తున్న సర్దార్



పిచ్చికుక్కలను పట్టిన మున్సిపల్ సిబ్బంది

సత్తుపల్లిటౌన్: పట్టణంలో శనివారం రాత్రి 9 గంటల సమయాన మూడు పిచ్చికుక్కలు స్వైరవిహారం చేశాయి. కేవలం గంట వ్యవధిలో 16 మందిని గాయపర్చడంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. పట్టణంలోని వేంసూరు రోడ్డు, బాలాజీ థియేటర్ సెంటర్, కల్పతరు రోడ్డు సెంటర్ ప్రాంతాల్లో మూడు పిచ్చికుక్కలు పరుగులు తీస్తూ రహదారిపై వెళ్తున్న వారిని గాయపరిచాయి. కుక్కల దాడితో భయభ్రాంతులకు గురైన స్థానికులు వాటిని వెంబడించడంతో పరారయ్యాయి. కాగా, ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన దాసరి వినయ్ ముఖంపై తీవ్ర గాయాలు కాగా, సత్తుపల్లిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. అలాగే, యుగేందర్‌రెడ్డి, సర్దార్, పొన్నంపల్లి కుమారి, చల్లగుళ్ల శ్రీను, జొన్నలగడ్డ లాజర్, తన్నీరు మౌనిక, వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మి, వేణు, వీరభద్రరావు తదితరులకు గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. వారిని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్‌తో పాటు కొత్తూరు ఉమామహేశ్వరరావు, అద్దంకి అనిల్, మట్టా ప్రసాద్, నడ్డి ఆనందరావు, రఫీ, అంకం రాజు, రఘు తదితరులు పాల్గొన్నారు. కాగా, పిచ్చికుక్కల దాడి విషయం తెలియగానే ప్రత్యేక సిబ్బందిని రంగంలోకి దింపగా రెండు కుక్కలను బంధించి జంతు జనన నియంత్రణ కేంద్రానికి తరలించారని మున్సిపల్ కమిషనర్ కె.సుజాత తెలిపారు.

ప్రయాణికులకు తప్పిన ప్రమాదం

మధిర: మధిర రైల్వేస్టేషన్‌లో శనివారం పలువురు ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. విజయవాడ నుంచి వచ్చే శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలుకు సంబంధించి శనివారం ఉదయం ప్లాట్‌ఫాం నంబర్‌ను రైల్వే సిబ్బంది తప్పుగా అనౌన్స్ చేశారు. దీంతో ప్రయాణికులు పలువురు పట్టాలపై నుంచి దాటుతుండగా అదే సమయానికి ఖమ్మం వైపు నుంచి సూపర్‌ఫాస్ట్ రైలు వచ్చింది. ఈ క్రమంలో ప్రయాణికులు కేకలు వేస్తూ పక్కకు తప్పుకోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. కాగా, రైల్వే సిబ్బంది తప్పిదంతోనే ఇలా జరిగిందని, ఇక నుంచి పునరావృతం కాకుండా చూడాలని సీపీఎం నాయకుడు మందా సైదులు తదితరులు కోరారు.

తీర్థాల వాగులో దూకి వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని మంగళగూడెంనకు చెందిన కటకం నరేశ్ (34) తీర్థాల వద్ద వాగులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నరేశ్ కుటుంబంతో కలిసి ఖమ్మంలో నివాసముంటుండగా గత నెల 30న స్వగ్రామం వచ్చాడు. తిరిగి 31వ తేదీన ఖమ్మం వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. ఈ నెల 1న తీర్థాల వాగు పక్కన ఆయన ద్విచక్రవాహనం, చెప్పులు, బట్టలు, పర్స్ ఉండడంతో వివరాల ఆధారంగా స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో శనివారం పరిశీలించగా నరేశ్ మృతదేహం లభ్యమైంది. ఆర్థిక ఇబ్బందులతో నరేశ్ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తుండగా, ఆయన తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

పల్లెప్రకృతివనం సమీపంలో కొండచిలువ

కొత్తగూడెంటౌన్: చుంచుపల్లి మండలం పరిధిలోని పల్లె ప్రకృతివనం పక్కన ఉన్న ఇంట్లోకి శనివారం 10 అడుగుల భారీ కొండచిలువ చొరబడింది. ఇంట్లోకి కొండ చిలువ రావడంతో స్థానికులు బలరాం (దత్తు) స్నేక్ టీంకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకుని కొండ చిలువను చాకచక్యంగా పట్టుకున్నారు. ఫారెస్టు అధికారి క్రాంతికుమార్‌కు అందించగా దగ్గరలోని అటవీ ప్రాంతంలో కొండచిలువను వదిలి వేశారు. కొండ చిలువను పట్టుకున్న వారిలో విఘ్నేష్, చిన్నా, నాని, పవన్ ఉన్నారు.

మధ్యవర్తిత్వమే ఉత్తమ మార్గం

▶ మొదటి పేజీ తరువాయి

మహనీయులు ప్రవచించిన జీవన విధానం మంచిదని సూచించారు. శనివారం హైదరాబాద్ షామీర్‌పేటలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో 20వ స్నాతకోత్సవం జరిగింది. ఇందులో సుప్రీం కోర్టు న్యాయమూర్తి, జాతీయ న్యాయసేవల ప్రాధికార సంస్థ (నల్సా) కార్యనిర్వాహక అధ్యక్షుడు జస్టిస్ సంజయ్‌కిషన్ కౌల్ ముఖ్య అతిథిగా, సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, వర్సిటీ చాన్సలర్ అలోక్ అరాధే అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ సంజయ్‌కిషన్ కౌల్ మాట్లాడుతూ.. "మనుషులం కనుకే ఆలోచిస్తాం.. ఒకరికొకరు భిన్నంగా ఆలోచిస్తాం. తర్క, వితర్కాలతో సంభాషించుకుంటూనే శాంతియుతంగా జీవించే సమాజం ఉండాలి. మన రాజ్యాంగ నైతికత కూడా దీన్నే తెలియజేస్తుంది. మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించే విధానంలో అందరి తర్కం, వాదన విని.. అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం లభిస్తుంది. నాలుగు మెదళ్ల సంఘర్షణ నుంచి వచ్చే పరిష్కారం మెరుగ్గానే ఉంటుందనడంలో ఆశ్చర్యం అవసరం లేదు.." అని పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు న్యాయం అందేలా కృషి చేయాలని న్యాయ విద్యార్థులకు పిలుపునిచ్చారు.

సీఎం కేసీఆర్ సహకారం మరువలేనిది..

నల్సార్ వర్సిటీలో వసతులు కల్పించడంలో సీఎం కేసీఆర్ సహకారం మరువలేనిదని వర్సిటీ వీసీ శ్రీకృష్ణదేవరావు పేర్కొన్నారు. జ్యుడిషియల్ అకాడమీ కోసం 25 ఎకరాలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. 25ఏళ్ల నల్సార్ వర్సిటీ ప్రస్థానంలో ఎన్నో కొత్త కోర్సులను తీసుకొచ్చామని, ఎందరో విద్యార్థులను సమాజానికి అందించామని చెప్పారు. లీగల్ ఎయిడ్‌తోపాటు అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ప్రోత్సహించడంలో నల్సార్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌డీ, ఎల్‌ఎల్‌ఎం, ఎంబీఏ, బీఏ ఎల్‌ఎల్‌బీ ఆనర్స్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలతో పాటు 58 మందికి బంగారు పతకాలను అందజేశారు. ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డితోపాటు ఇతరులు రాసిన పుస్తకాలను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు సీజే ఆవిష్కరించారు. హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముడుపులివ్వకపోతే మూడినట్లే!

▶ మొదటి పేజీ తరువాయి

ఎలా చేరాయన్న విషయాన్ని ఐటీ శాఖ స్పష్టంగా ఓ పట్టిక రూపంలో వివరించింది. ఇంత స్పష్టమైన ఆధారాలున్నాయి కనక దీన్ని చంద్రబాబు సంపాదించిన అక్రమ ఆదాయంగా ఎందుకు పరిగణించకూడదో చెప్పాలని నోటీసుల్లో పేర్కొంది.

మనోజ్ పార్థసాని ఏం చెప్పారంటే...

మనోజ్ పార్థసాని కార్యాలయంలో సోదాల అనంతరం ఆయన్ను ఐటీ శాఖ కొన్ని ప్రశ్నలడిగింది. దానికి ఆయనిచ్చిన సమాధానాలను రికార్డు చేసింది. ఆ ప్రశ్న జవాబులు ఎలా సాగాయంటే...

ఐటీ శాఖ: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మీరు తరచూ కలిసేవారా? ఎక్కడ? ఏం మాట్లాడుకునేవారు?


ఎంవీపీ: రాజధాని తాత్కాలిక భవనాల నిర్మాణ పనులు షాపూర్జీ పల్లోంజీ సంస్థకు దక్కాయి. ఆ సమయంలో అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడిని పలు సమావేశాలు, ప్రజంటేషన్ల సమయంలో కలిశాను. ఏపీ టిడ్కో ఇళ్ల నిర్మాణం (2017లో షాపూర్జీ పల్లోంజీ 1.40 లక్షల ఇళ్లను నిర్మించే కాంట్రాక్టును దక్కించుకుంటే 2019 మార్చి నాటికి కేవలం 23వేల ఇళ్ల నిర్మాణాన్నే పూర్తి చేసింది) ఈడబ్ల్యూఎస్ హౌసింగ్, హైకోర్టు నిర్మాణం, అమరావతి రాజధాని ప్రాంతంలో ఇతర విభాగాధిపతులు కార్యాలయాల నిర్మాణల సమయంలో చంద్రబాబును పలు సందర్భాల్లో కలిశా. ఇవి పూర్తిగా ప్రభుత్వం నిర్వహించిన సమావేశాలు. ఏపీటిడ్కో, ఏపీ సీఆర్‌డీఏ వాళ్లు నిర్వహించే ఈ సమావేశాలకు షాపూర్జీ పల్లోంజీ ప్రతినిధులతో కలిసి నేను హాజరయ్యాను.చంద్రబాబు నాయుడిని తొలిసారిగా వ్యక్తిగతంగా కలిసినప్పుడు... ఆయన 2019, ఫిబ్రవరిలో విజయవాడలోని తన ఇంటికి వచ్చి కలవాలని చెప్పారు. ఆయన చెప్పిన ప్రకారం ఆయన ఇంటికి వెళ్లా. అక్కడకు వెళ్లి కలిసినపుడు రాజధానిలో జరుగుతున్న వివిధ నిర్మాణ పనుల స్థితి గతులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు తన వ్యక్తిగత కార్యదర్శి పెండ్యాల శ్రీనివాస్‌ను నాకు పరిచయం చేశారు. ఆయన చెప్పినట్టుగా నడుచుకోవాలని ఆదేశించారు.

ఐటీ శాఖ: చంద్రబాబు నాయుడు తరఫున శ్రీనివాస్ మీకు ఎలాంటి సూచనలిచ్చారు?

ఎంవీపీ: శ్రీనివాస్ నాకు కొన్ని కంపెనీల జాబితాను పంపిస్తానని చెప్పాడు. ఆ కంపెనీల ద్వారా ముడుపులు తరలించాలని చెప్పారు. శ్రీనివాస్ ఆదేశాల మేరకు సబ్ కాంట్రాక్టు పనులు పొందిన విక్కీజైన్ అనే వ్యక్తి టచ్‌లోకి వచ్చారు. విక్కీ జైన్ నయోలిన్, ఎవరెట్ అనే కంపెనీల పేర్లను ఇచ్చారు. శ్రీనివాస్ ఆదేశాల మేరకు మార్చి, 2019లో నన్ను విజయ్ నంగాలియా అనే వ్యక్తి కలిశారు. ముంబై కొలాబాలో ఉన్న షాపూర్జీ పల్లోంజీ ఆఫీసు బయట ఆయన నన్ను కలిశారు. నంగాలియా, హయగ్రీవ, అన్నై, షలాక కంపెనీలకు సబ్ కాంట్రాక్టు రూపంలో వర్క్ ఆర్డర్ల పేరిట ముడుపుల నగదు తరలించాల్సిందిగా సూచించారు. ఇలా తరలించిన నగదును విక్కి, వినయ్ నంగాలియాలు చంద్రబాబు నాయుడు ఎక్కడకు చేరవేయమంటే అక్కడకు చేరవేసేవారు. ఈ కంపెనీల్లోకి ఇంకా బోలెడంత నగదు వచ్చింది. అది ఎక్కడి నుంచి వచ్చింది? దాన్ని ఎక్కడకు తరలించారన్న సంగతులు నాకు తెలియవు. ఎందుకంటే కేవలం షాపూర్జీ పల్లోంజీ కంపెనీ నుంచి జరిగిన చెల్లింపుల వరకే నాకు తెలుసు. ఆ విషయం నాకు తెలుసు కనక దాన్ని శ్రీనివాస్‌కు చెప్పి... ఆ మొత్తం చంద్రబాబుకు చేరిందా లేదా అన్న విషయాన్ని కనుక్కునేవాడిని.

ఐటీ శాఖ: చంద్రబాబు నాయుడు, శ్రీనివాస్ చెప్పినంత మాత్రాన బోగస్ ఇన్వాయిస్‌ల ద్వారా నగదు తరలించడం తప్పు కదా? దాన్ని మీరు ఎందుకు వ్యతిరేకించలేదు?

ఎంవీపీ: శ్రీనివాస్ ఈ కంపెనీల ద్వారా బోగస్ బిల్లులతో నగదు తరలించాలని చేసిన ప్రతిపాదనను మొదట్లో నేను వ్యతిరేకించాను. షాపూర్జీ పల్లోంజి అనేది అతిపెద్ద కార్పొరేట్ సంస్థ అని, అవసరమైతే వాళ్లు అడిగిన మొత్తాన్ని నేరుగా పార్టీ ఫండ్ రూపంలోనే చెల్లిస్తుందని చెప్పాను. అప్పుడు వాళ్లు చాలా స్పష్టంగా చెప్పారు... "ఇది పార్టీ ఫండ్ కాదు. ఈ కంపెనీల ద్వారా మేం చెప్పిన వ్యక్తులకు నేరుగా నగదును తరలించాల్సిందే. ఒకవేళ మీరు గనక మా ఆదేశాలు పాటించకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని. నిజానికి అప్పటికే మేం రాజధానిలో చాలా ప్రాజెక్టుల్లో ఇరుక్కుపోయి ఉన్నాం. నడుస్తున్న అనేక ప్రాజెక్టులతో భారీగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వాళ్లు చెప్పినట్లుగా వినటం తప్ప మాకు వేరే దారి కనిపించలేదు.



టీవీ5 చానల్‌ను బ్యాన్ చేయాలి

- మహిళలను నీచంగా మాట్లాడి క్షమాపణ చెప్పరా?
- ఇదేంటని నిలదీసినందుకు నన్ను చంపుతానంటారా?
- పోసాని కృష్ణమురళి ఆగ్రహం



సాక్షి, అమరావతి: జర్నలిజం విలువలు దిగజార్చేలా సమాజంలోని మహిళలను అసభ్య పదజాలంతో కించపరుస్తున్న టీవీ5 చానల్‌ను వెంటనే నిషేధించాలని ఏపీ చలనచిత్ర, టీవీ నాటక రంగాభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి కోరారు. హైదరాబాద్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీవీ5 చైర్మన్ బీఆర్ నాయుడు ప్రోద్బలంతో న్యూస్ రీడర్ సాంబశివరావు సినిమా ఇండస్ట్రీలోని మహిళలపై నీచమైన వ్యాఖ్యలతో అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి దిగజారుడు జర్నలిజాన్ని ఖండించినందుకు తనను చంపుతానని సాంబశివరావు బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు బూతులతో సమాజాన్ని ప్రశ్నించే హక్కును ఏ రాజ్యాంగం, ఏ న్యాయస్థానం ఇచ్చిందని నిలదీశారు. ప్రజా ప్రయోజనకర వార్తలను ప్రసారం చేస్తే రేటింగ్ పెరుగుతుంది తప్ప.. నీచమైన భాషను సమాజం హర్షించదన్నారు.

ఆడపడుచులలకు టీవీ5 క్షమాపణ చెప్పేంత వరకు పోరాటం చేస్తూనే ఉంటానన్నారు. 'బీఆర్ నాయుడు పెద్ద దొంగ. టీవీ5 చానల్ పెట్టేముందు ఓ వ్యక్తి దగ్గరకు వెళ్లి సాయం అడిగారు. ఆయన రూ.30 కోట్లు ఇచ్చి చానల్ పెట్టుకోమన్నారు. కొన్నేళ్ల తర్వాత సదరు వ్యక్తి డబ్బులు తిరిగి అడిగినందుకు అంతు చూస్తామంటూ బెదిరించాడు. మరో వడ్డీ వ్యాపారి దగ్గర రూ.12 కోట్లు తీసుకుని.. డబ్బులు అడిగితే.. తుపాకీతో చంపుతానని భయపెట్టారు. సాంబశివరావుతో క్షమాపణ చెప్పించి చానల్ నుంచి బయటకు పంపించడం బీఆర్ నాయుడికి ఇష్టంలేదు. మహిళలను తిట్టేవాళ్లంటే నాయుడికి ఎంతో ఇష్టం. తన వెనుక బూతులు తిట్టే లోకేశ్, చంద్రబాబు ఉన్నారనే ధైర్యంతో రెచ్చిపోతూ ఇంకా తిట్టమని ప్రోత్సహిస్తున్నారు. వీళ్ల ఉచ్చం నీచం లేని వ్యక్తులు' అంటూ పోసాని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంతర్లీన శక్తిసామర్థ్యాలకు విద్యార్థులు పదునుపెట్టాలి

గవర్నర్ తమిళిసై

మంగళగిరి/ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విద్యార్థులు తమలో అంతర్లీనంగా దాగి ఉన్న శక్తి సామర్థ్యాలకు నిత్యం పదును పెట్టాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ సూచించారు. అప్పుడే అన్ని రంగాల్లో పోటీని సమర్థంగా ఎదుర్కోగలరని చెప్పారు. మంగళగిరి మండలం నీరుకొండలోని ఎస్‌ఆర్‌ఎం విశ్వవిద్యాలయంలో శనివారం యూనివర్సిటీ 3వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తమిళిసై మాట్లాడుతూ ప్రతిరోజూ విద్యార్థులు కొత్త టెక్నిక్స్ నేర్చుకోవాలని, అవకాశాలను సృష్టించుకోవాలని చెప్పారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ అశుతోష్ శర్మ మాట్లాడుతూ, విద్యార్థులు కొత్త లక్ష్యాలు, ఆశయాలతో ముందుకు సాగాలన్నారు. అనంతరం శాస్త్ర సాంకేతిక రంగాల్లో విశేష సేవలు అందించిన డాక్టర్ అశుతోష్ శర్మకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కాగా, ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను గవర్నర్ తమిళిసై దర్శించుకున్నారు.



విజయవాడ ఆలయంలో గవర్నర్ తమిళిసై

మెత్తబడని అసమ్మతి!

▶ మొదటి పేజీ తరువాయి

ఇప్పుడు సర్దుబాటుకుససేమిరా అంటున్నారు. మరోవైపు అధికార పార్టీ ఎమ్మెల్యేలతో అంటకాగి పదవులు, పనులు పొందిన చోటా మోటా నేతలు కూడా ఏదో ఒక సాకు చూపుతూ ప్రస్తుతం దూరం పాటిస్తున్నారు. దీంతో ఎన్నికల ప్రచారంలోకి దిగాలనుకుంటున్న అభ్యర్థుల అడుగులు ముందుకు పడట్లేదు. ఆయా అభ్యర్థుల కుటుంబ సభ్యులు, ముఖ్య నేతలు అసమ్మతిని చల్లార్చేందుకు రాయబారం నెరపుతున్నా ఆశించిన ఫలితం రావట్లేదు. చాలా నియోజకవర్గాల్లో బుజ్జగింపుల పర్వం వికటించి కిందిస్థాయి నేతలు ఇతర పార్టీల వైపు చూస్తున్నారు. నియోజకవర్గాలవారీగా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బుజ్జగింపుల పర్వాన్ని పర్యవేక్షిస్తున్నారు. మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, ఇంద్రకరణ్‌రెడ్డి, పువ్వాడ అజయ్, జగదీశ్ రెడ్డి తదితరులు వారు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి జిల్లా పార్టీ నేతలతో మంతనాలు జరుపుతూ దిద్దుబాటుకు ప్రయత్నిస్తున్నారు.

సొంతదారి వైపు అసమ్మతి చూపు

ఒకేసారి 115 మంది అభ్యర్థులను ప్రకటించడం బీఆర్‌ఎస్‌లో సంచలనం సృష్టించగా టికెట్ ఆశించి భంగపడిన నేతలు సొంత దారి చూసుకోవడంపై దృష్టిసారించారు. ఇప్పటికే ఎమ్మెల్యే రేఖానాయక్ (ఖానాపూర్), వేముల వీరేశం (నకిరేకల్) పార్టీని వీడగా మైనంపల్లి హన్మంతరావు (మల్కాజిగిరి), మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు (పాలేరు) తమ అనుచరులతో మంతనాలు జరుపుతున్నట్లు చెబుతున్నారు. తాము సైతం బీఆర్‌ఎస్‌ను వీడటం ఖాయమని ఇప్పటికే స్పష్టమైన సంకేతాలు ఇస్తున్నారు. పటాన్‌చెరు, జహీరాబాద్, మెదక్, కల్వకుర్తి, సంగారెడ్డి, అలంపూర్, నాగార్జునసాగర్, కోదాడ, సూర్యాపేట, రామగుండం తదితర నియోజకవర్గాల్లో అసమ్మతి నేతలు మండల స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఇచ్చిన టికెట్లు రద్దు చేసి తమకు కేటాయించాలంటూ అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తున్నారు. నియోజకవర్గ స్థాయిలో నెలకొన్న అసమ్మతి దిద్దుబాటుకు మంత్రి టి.హరీశ్‌రావు స్వయంగా రంగంలోకి దిగి అసమ్మతి నేతలతో తన నివాసంలో వరుస భేటీలు జరుపుతున్నారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటూ అభ్యర్థుల గెలుపు కోసం కలసికట్టుగా పనిచేయాలని కోరుతున్నారు. మెదక్, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాలకు చెందిన అసమ్మతి నేతలు శుక్ర, శనివారాల్లో హరీశ్‌రావుతో భేటీ అయ్యారు. మరోవైపు అమెరికా పర్యటనలో ఉన్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఈ నెల 6న తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారని పార్టీవర్గాలు వెల్లడించాయి. కేటీఆర్ రాక తర్వాత బుజ్జగింపుల పర్వం వేగం పుంజుకోవడంతోపాటు క్షేత్రస్థాయిలో ప్రచారం కూడా పట్టాలెక్కుతుందని చెబుతున్నాయి.

జనగామ, నర్సాపూర్ పంచాయితీ యథాతథం

జనగామ, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థుల ప్రకటనపై నెలకొన్న సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి (జనగామ), చిలుముల మదన్‌రెడ్డి (నర్సాపూర్) తమకు టికెట్ దక్కుతుందనే ధీమాతో ఉన్నారు. మరోవైపు మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి (నర్సాపూర్), ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి (జనగామ) తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. కేటీఆర్ వచ్చిన తర్వాత ఈ రెండు నియోజకవర్గాలపై పీటముడి వీడే అవకాశముంది. జనగామలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి టికెట్ కోసం సర్వశక్తులూ ఒడ్డుతుండటంతో మధ్యేమార్గంగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పేరు తెరమీదకు వస్తున్నట్లు తెలిసింది.

జిల్లా వార్తలు

రామాలయంలో ఐటీడీఏ పీఓ పూజలు



ప్రతీక్‌జైన్ కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనం అందజేస్తున్న పండితులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ శనివారం కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు. తొలుత పీఓకు అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకోవడంతో పాటు ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే, పండితులు ఆలయ విశిష్టతను వివరించి వేదాశీర్వచనం అందజేశారు. ఏఈఓ శ్రావణ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సాయిబాబు పాల్గొన్నారు.

6న భద్రాచలంలో జాబ్‌మేళా

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని గిరిజన నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పించేందుకకు ఈనెల 6న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్ తెలిపారు. 18నుంచి 30 ఏళ్ల వయస్సు వారు అర్హులని పేర్కొన్నారు. నవత ట్రాన్స్‌పోర్ట్, ముత్తూట్ ఫైనాన్స్, సన్‌షైన్ హెల్త్ కేర్, రిలయన్స్ లైఫ్ ఇన్సూరెన్స్, అపోలో ఫార్మసీ, టాటా లైఫ్ ఇన్సూరెన్స్, వెంకటేశ్వర సెక్యూరిటీ సర్వీసెస్ తదితర కంపెనీల్లో నియామకాల కోసం ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లతో 6వ తేదీన ఉదయం 9గంటలకు భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో మొదలయ్యే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పీఓ సూచించారు.

వివేకానంద విదేశీ విద్యాపథకం దరఖాస్తు గడుపు పెంపు

కొత్తగూడెంటౌన్: వివేకానంద విదేశీ విద్యాపథకం దరఖాస్తు స్వీకరణ గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడిగించారని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షుడు దండిబొట్ల రామాంజనకుమారశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. వివేకానంద విదేశీ విద్యా పథకం, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ఆర్థికసాయం కోసం తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు దరఖాస్తు చేసుకునే గడువు ఆగస్టు 31న ముగిసిందని, కానీ, అర్హులు దరఖాస్తు చేసుకునేలా గడువు పొడిగించినందున సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రెండో రోజుకు చేరిన 'అగ్నివీర్'



ఈవెంట్లకు హాజరయ్యేందుకు వేచిచూస్తున్న అభ్యర్థులు

- 1,265 మందిలో ర్యాలీకి 965 మంది హాజరు
- మెడికల్ టెస్ట్‌లో అర్హత సాధించిన 429 మంది
- పచ్చబొట్టుతో పలువురిపై అనర్హత వేటు

ఖమ్మంస్పోర్ట్స్: సైన్యంలో చేరాలనే దృఢ సంకల్పంతో సిద్ధమైన అభ్యర్థులు అగ్నివీర్ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఈవెంట్లు శనివారం రెండోరోజుకు చేరాయి. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా రాతపరీక్షలో అర్హత సాధించిన 1,265 మందికి అడ్మిట్ కార్డులు జారీ చేయగా 965 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అయితే, ఈవెంట్ల అనంతరం మెడికల్ టెస్ట్‌లో 429 మంది అర్హత సాధించారు. కాగా, అర్ధరాత్రి నుంచే ఎంపిక పోటీలు మొదలవుతుండటంతో వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న అభ్యర్థులు స్టేడియం వద్దే సేద తీరుతున్నారు. కాగా, రాత్రి 9 గంటల నుంచి అభ్యర్థులను ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలోకి, ఆ తర్వాత స్టేడియంలోకి అనుమతిస్తున్నారు.

పచ్చబొట్టు ఉంటే కట్..

చేతులపై పచ్చబొట్టు, టాటూలు ఉన్న అభ్యర్థులకు కష్టాలు తప్పటం లేదు. పచ్చబొట్టు ఉన్న వారిని అనుమతించేది లేదని ఆర్మీ అధికారులు ముందుగానే స్పష్టం చేశారు. అయితే, కుడిచేతిపై పచ్చబొట్టు ఉన్న అభ్యర్థులను వెనక్కి పంపిస్తుండగా నిరాశగా వెళ్లిపోతున్నారు. అయితే, ఎడమ చేతి మీద పచ్చబొట్టు వేసుకుని వచ్చిన వారిని మాత్రం అనుమతించినట్లు తెలుస్తోంది.

ఎక్కడికక్కడ కట్టడి

అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీని ఆర్మీ అధికారులు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ప్రతీ ఈవెంట్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడమే కాక టీవీల ద్వారా అధికారులు పరిశీలిస్తున్నారు. కాగా, అభ్యర్థులతో పాటు పలువురు కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు వచ్చిన నేపథ్యాన వారిని నిలువరించేందుకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. కాగా, మెడికల్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డుకు పంపించాక.. అక్కడి నుంచి ఎంపికైన వారి జాబితా వెల్లడిస్తారని సమాచారం.

రేపటి నుంచి జేకేఓసీ నిర్వాసిత ప్రాంత సర్వే

ఇల్లెందురూరల్: సింగరేణి సంస్థ ఇల్లెందు ఏరియాలో ప్రారంభించనున్న జేకేఓసీ ప్రాజెక్టు భూనిర్వాసితులకు సంబంధించి సమగ్ర సర్వే సోమవారం నుంచి పునఃప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని అటవీశాఖ డివిజనల్ అధికారి వెంకన్న శనివారం వెల్లడించారు. జేకేఓసీ నిర్వాసిత ప్రాంతంలో సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ సమీపాన సర్వే నంబర్ 549 పరిధిలో 154 హెక్టార్ల అటవీ భూభాగం ఉందని చెప్పారు. ఇందులో కొందరు రైతులు సాగు చేస్తున్నట్లు గుర్తించి గతంలో రెవెన్యూ, అటవీ శాఖల ఆధ్వర్యాన సర్వే చేసి నిర్వాసిత జాబితా రూపొందించగా, అక్రమాలు జరిగినట్లు తెలిసిందన్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరోసారి సర్వే చేపడుతున్నామని తెలిపారు. సర్వే నంబర్ 549 పరిధి అటవీభూమిలో ఎందరు రైతులు, ఎంత మేర సాగు చేస్తున్నారనే విషయాన్ని సమగ్రంగా సర్వే చేయనున్నామని, పొరపాట్లు జరగకుండా పర్యవేక్షిస్తామని ఆయన వెల్లడించారు.

ఆంధ్ర సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు



చెక్‌పోస్ట్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ రెహమాన్, సీఐ సాగర్

వైరారూరల్: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యాన వైరా సబ్ డివిజన్ పరిధిలోని రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దులో ఆరు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన వైరా మండలంలోని గన్నవరం - దాచాపురం క్రాస్ రోడ్డులో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టును శనివారం వైరా ఏసీపీ ఎంఏ రెహమాన్, సీఐ నూనావత్ సాగర్, ఎస్ఐ మేడా ప్రసాద్ పరిశీలించారు. ఇక్కడ విధినిర్వహణపై సిబ్బందికి సూచనలు చేశారు.

గణేష్ టెంపుల్ హుండీ ఆదాయం రూ.3,31,042

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలోని శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం (గణేష్ టెంపుల్) హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను శనివారం లెక్కించారు. ఈ సందర్భంగా ఐదు నెలల కాలానికి గాను రూ.3,31,042 ఆదాయం నమోదైందని ఈఓ కె.సులోచన తెలిపారు. భక్తులు, ఆలయ కమిటీ సభ్యుల సమక్షాన కానుకలను లెక్కించగా ఈఓ పర్యవేక్షించారు. కాగా, భక్తులు సమర్పించిన బంగారు, వెండి ఆభరణాలను తిరిగి హుండీలో వేసినట్లు తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ రవీందర్, ఎన్.నరేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నగదు లెక్కిస్తున్న సభ్యులు, భక్తులు

రద్దు చేసిన రైళ్లన్నంటినీ పునరుద్ధరించండి



ధర్నాలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, నాయకులు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
- కొత్తగూడెం స్టేషన్ ఎదుట ధర్నా

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం నుంచి మొదలయ్యే రైళ్లతో పాటు ఇతర ప్రాంతాల నుంచి నడిచే రైళ్లను రద్దు చేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నందున వెంటనే పునరుద్ధరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. కొత్తగూడెం రైల్వేస్టేషన్ ఎదుట సీపీఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. రైళ్ల రద్దుతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ట్రాక్ మరమ్మతుల పేరుతో నాలుగు నెలలుగా రద్దు నిర్ణయాన్ని పొడిగిస్తున్న అధికారులు.. ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో కూడా చెప్పకపోవడం సరికాదన్నారు. బొగ్గు రవాణాపై చూపుతున్న శ్రద్ధ ప్రజల రవాణాపై చూపకపోవడం ఏమిటని కూనంనేని ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు కూడా పట్టింపు లేనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ధర్నాలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, నాయకులు వై.శ్రీనివాస్‌రెడ్డి, కె.జమలయ్య, వాసిరెడ్డి మురళి, కందుల భాస్కర్, జి.నాగేశ్, గని గండ్ల వీరస్వామి, భూక్యా శ్రీనివాస్, ఎస్‌కే ఫహీం, మాచర్ల శ్రీను, చింతల రాజు, పోగుల కోటేశ్వరరావు, పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, సందెబోయిన శ్రీనివాస్, అబ్బులు తదితరులు పాల్గొనగా, రైల్వే అధికారులకు వినతిపత్రం అందజేశారు.

జర్మనీ సదస్సులో ఇఫ్టూ నేత

ఇల్లెందు: ప్రపంచవ్యాప్తంగా గని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు జర్మనీలో ఏర్పాటు చేసిన సదస్సుకు భారత్ నుంచి సీపీఐ (ఎంఎల్) ఎన్డీ చంద్రన్న వర్గం అనుబంధ ఇఫ్టూ ఆల్ ఇండియా అధ్యక్షుడు సాధినేని వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు. జర్మనీలో గత నెల 31న మొదలైన ఈ సదస్సులో పాల్గొంటున్న ఆయన దేశంలో గని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించగా, పరిష్కార మార్గాలపై చర్చించారు. ఈ విషయాన్ని వెంకటేశ్వరరావు శనివారం ఫోన్‌లో వెల్లడించారు.



జర్మనీ సదస్సులో మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సింగరేణి(కొత్తగూడెం): దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జ్ కొత్తకాపు లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఢిల్లీలో శనివారం కోల్ సెక్రటరీ అమృతలాల్ మీనాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులకు పెరిగిన జీతభత్యాలు అమలు చేయడమే కాక ఉద్యోగ, ఆర్థిక భద్రత కల్పించాలని, అన్ని గనుల్లో భద్రతా నియమాలు పాటించేలా చూడాలని కోరారు. కోల్ సెక్రటరీని కలిసిన వారిలో బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తదితరులు ఉన్నారు.



అమృతలాల్‌కు వినతిపత్రం ఇస్తున్న లక్ష్మారెడ్డి